టీటీలో తెలంగాణకు కాంస్యం

38వ నేషనల్ గేమ్స్

డెహ్రాడూన్: ఉత్తరాఖండ్ వేదికగా జరుగుతున్న ప్రతిష్ఠాత్మక నేషనల్ గేమ్స్‌లో తెలంగాణ ఖాతాలో మరో పతకం చేరింది. సోమవారం తెలంగాణ పురుషుల టేబుల్ టెన్నిస్ టీమ్ కాంస్య పతకం దక్కించుకుంది. మహారాష్ట్రతో జరిగిన సెమీఫైనల్ పోరులో స్వర్ణేందు చౌదరీ, మహమ్మద్ అలీ, ఎస్ఎఫ్ఆర్ స్నేహిత్‌తో కూడిన తెలంగాణ టీమ్ 0-3తో ఓటమిపాలైంది. తొలి గేమ్‌లో స్వర్ణేందు 1-3తో చిన్మయ చేతిలో ఓడగా, అలీ 0-3తో రీగన్ అల్‌బుకెర్‌పై, స్నేహిత్ 0-3తో జశ్ మోదీపై ఓటమిపాలయ్యారు. అంతకు ముందు జరిగిన క్వార్టర్స్‌లో తెలంగాణ 3-2తో ఉత్తరప్రదేశ్‌పై గెలిచింది. మిగతా ఈవెంట్ల విషయానికొస్తే..మహిళల 200మీటర్ల రేసులో నిత్యగాదె ఫైనల్‌కు అర్హత సాధించింది. మహిళల అర్టిస్టిక్ జిమ్నాస్టిక్స్‌లో నిశిక అగర్వాల్, సురభి ప్రసన్న తుదిపోరులో నిలిచారు. మహిళల నెట్‌బాల్‌లో తెలంగాణ టీమ్ 23-18తో ఉత్తరాఖండ్‌పై గెలిచింది. జూడోలో రమ్య(48కి), అలేఖ్య(57కి) ప్రత్యర్థుల చేతిలో ఓటమిపాలయ్యారు.

మెరిసిన ఇషాసింగ్

న్యూఢిల్లీ: కర్ణిసింగ్ షూటింగ్ రేంజ్ వేదికగా జరుగుతున్న షూటింగ్ ప్రపంచకప్ ట్రయల్స్-1లో తెలంగాణ యువ షూటర్ ఇషాసింగ్ మెరిసింది. సోమవారం జరిగిన మహిళల 25మీటర్ల పిస్టల్ ట్రయల్స్‌లో ఒలింపియన్ ఇషా సత్తాచాటింది. తన గురికి తిరుగులేదని నిరూపిస్తూ ఈ యువ షూటర్ 35 పాయింట్లతో రెండో స్థానంలో నిలిచింది. పంజాబ్‌కు చెందిన సిమ్రన్‌ప్రీత్ కౌర్‌బ్రార్(36), ఒలింపిక్ డబుల్ మెడలిస్ట్ మనుభాకర్(31) వరుసగా ఒకటి, మూడు స్థానాలు దక్కించుకున్నారు. మరోవైపు పురుషుల 10మీటర్ల ఎయిర్ రైఫిల్‌లో మహారాష్ట్ర షూటర్ రుద్రాంక్ష్ పాటిల్, మహిళల 50మీటర్ల రైఫిల్ త్రీ పొజిషన్స్‌లో సిఫ్ట్‌కౌర్ సమ్రా అగ్రస్థానాల్లో నిలిచారు.

బుమ్రా భవితవ్యం తేలేది నేడే

బెంగళూరు: భారత పేస్ దళ నాయకుడు జస్‌ప్రీత్ బుమ్రా చాంపియన్స్ ట్రోఫీలో ఆడతాడా? లేదా? అనేది మంగళవారం తేలనుంది. వెన్ను నొప్పి కారణంగా బెంగళూరులోని నేషనల్ క్రికెట్ అకాడమీ (ఎన్‌సీఏ)లో పునరావాసం పొందుతున్న బుమ్రా ను చాంపియన్స్ ట్రోఫీలో ఆడించాలా? వద్దా? అన్నదానిపై టీమ్ మేనేజ్‌మెంట్, సెలెక్టర్లు మంగళవారం కీలక నిర్ణయం తీసుకోనున్నారు. ఈ టోర్నీకి ఎంపిక చేసిన ప్రాథమిక జట్టులో మార్పులు చేర్పులు చేసుకోవడానికి ఫిబ్రవరి 12 చివరి తేదీ అవడంతో బీసీసీఐ ఏ నిర్ణయం తీసుకుంటుందనేది ఆసక్తికరంగా మారింది.ఇదిలా ఉండగా బుమ్రాపై ఎక్కువ భారం పడకుండా కీలక మ్యాచ్‌లలో మాత్రమే ఆడిస్తారన్న ఊహాగానాలు వినిపిస్తున్నాయి.

పట్టు బిగించిన ముంబై

కోల్‌కతా: హర్యానాతో ఈడెన్ గార్డెన్‌లో జరుగుతున్న రంజీ క్వార్టర్స్‌లో మాజీ చాంపియన్ ముంబై మ్యాచ్‌పై పట్టు బిగించింది. తొలి ఇన్నింగ్స్‌లో బ్యాటింగ్ వైఫల్యంతో నిరాశపరిచినా ఆ తర్వాత ముంబై అద్భుతంగా పుంజుకుంది. ఫస్ట్ ఇన్నింగ్స్‌లో 14 పరుగుల కీలక ఆధిక్యాన్ని దక్కించుకున్న ఆ జట్టు రెండో ఇన్నింగ్స్‌లో బ్యాటింగ్ చేస్తూ మూడో రోజు ఆట ముగిసే సమయానికి 4 వికెట్ల నష్టానికి 278 పరుగులు చేసింది. గత కొంతకాలంగా ఫామ్‌లేమితో తంటాలు పడుతున్న కెప్టెన్ అజింక్యా రహానే (88 బ్యాటింగ్), మిస్టర్ 360 సూర్యకుమార్ యాదవ్ (70), శివమ్ దూబె (30 బ్యాటింగ్) రాణించడంతో ఆ జట్టు 292 పరుగుల ఆధిక్యంలో నిలిచింది. అంతకుముందు శార్దూల్ విజృంభించడంతో హర్యానా మొదటి ఇన్నింగ్స్‌లో 301 పరుగులకే (ముంబై 315) ఆలౌట్ అయింది.

ఫ్లడ్‌లైట్లు ఎందుకు వెలుగలేదు?

- ఒడిశా క్రికెట్ సంఘంపై ప్రభుత్వం ఆగ్రహం

కటక్: భారత్, ఇంగ్లండ్ మధ్య ఆదివారం కటక్‌లోని బారాబతి స్టేడియంలో జరిగిన రెండో వన్డే సందర్భంగా మైదానంలోని ఫ్లడ్‌లైట్లు వెలుగక ఆటకు అంతరాయం కలిగిన ఘటనను ఒడిశా ప్రభుత్వం సీరియస్‌గా తీసుకుంది. దీనిపై సమగ్ర విచారణ జరిపి పదిరోజుల్లోపు వివరణ ఇవ్వాలని ఒడిశా క్రికెట్ అసోసియేషన్ (ఓసీఏ)కు షోకాజ్ నోటీసులు జారీ చేసింది. 'ఫ్లడ్‌లైట్లు ఎందుకు వెలుగలేదు? దీని వెనుక బాధ్యులు వ్యక్తులా లేక ఏజెన్సీనా? భవిష్యత్‌లో ఇలాంటివి పునరావృతం కాకుండా తీసుకోబోయే జాగ్రత్తలు ఏంటి?' వంటి విషయాలపై 10 రోజుల్లో వివరణ ఇవ్వాలని నోటీసుల్లో పేర్కొంది. మ్యాచ్‌లో భారత బ్యాటింగ్ చేస్తుండగా ఇన్నింగ్స్ 6.1 ఓవర్‌లో ఫ్లడ్‌లైట్లు ఆగిపోయి సుమారు 35 నిమిషాల పాటు ఆట నిలిచిపోయింది. దీంతో ఆటగాళ్లు పెవిలియన్ చేరగా, ప్రేక్షకులు చాలా ఇబ్బందిపడ్డారు.

పతకం రంగు మార్చాలని..

నేటి నుంచి బ్యాడ్మింటన్ ఆసియా మిక్స్‌డ్ టీమ్ చాంపియన్‌షిప్

కింగ్డొ (చైనా): ఈ ఏడాది పలు బీడబ్ల్యూఎఫ్ టోర్నీలలో ఆశించిన ఫలితాలు సాధించక సతమతమవుతున్న భారత షట్లర్లకు మరో ప్రతిష్టాత్మక టోర్నీ సవాల్ విసరనుంది. మంగళవారం నుంచి కింగ్డొ వేదికగా బ్యాడ్మింటన్ ఆసియా మిక్స్‌డ్ టీమ్ చాంపియన్‌షిప్ (బీఏఎంటీసీ) మొదలుకానుంది. గత ఎడిషన్‌లో కాంస్యం సాధించిన భారత జట్టు ఈసారి పతకం రంగు మార్చాలనే లక్ష్యంతో బరిలోకి దిగుతోంది. అయితే 2023 ఎడిషన్‌లో భారత్ పతకం సాధించడంలో కీలక పాత్ర పోషించిన స్టార్ షట్లర్ పీవీ సింధు లేకపోవడం భారత్‌కు భారీ లోటు. ఈ టోర్నీలో భారత్ 13 మంది బృందంతో బరిలోకి దిగుతోంది. లక్ష్యసేన్, ప్రణయ్, సాత్విక్-చిరాగ్, ధ్రువ్, అర్జున్, సతీశ్ కుమార్ బరిలో ఉన్నారు. మహిళల విభాగంలో మాళవిక, గాయత్రి గోపీచంద్, త్రీసా జాలి, అశ్విని పొన్నప్ప, తనీషా క్రాస్టో, ఆధ్య వరియత్ బాధ్యతలను మోయనున్నారు.

గుకేశ్‌కు షాక్

హాంబర్గ్ (జర్మనీ): వరల్డ్ చాంపియన్ దొమ్మరాజు గుకేశ్‌కు ప్రీస్టయిల్ గ్రాండ్‌స్లామ్ చెస్ టోర్నీలో షాక్ తగిలింది. వరుసగా రెండో క్వార్టర్స్ మ్యాచ్‌లోనూ అతడు అమెరికా ఆటగాడు ఫాబియానో కరువానా చేతిలో ఓడిపోయాడు. ఈ టోర్నీ బరిలో నిలవాలంటే తప్పక గెలవాల్సిన మ్యాచ్‌లో గుకేశ్.. 18 ఎత్తుల్లో చిత్తయ్యాడు. టైటిల్ పోరు నుంచి నిష్క్రమించిన గుకేశ్.. ఇక చివరి నాలుగు స్థానాల కోసం ఆడనున్నాడు.

రాహుల్‌ను కాదని అక్షర్‌ను పంపిస్తున్న గంభీర్

ఐదులో ప్రయోగాలు!

గత రెండు మ్యాచ్‌లలో కేఎల్ అట్టర్ ఫ్లాఫ్ • పంత్ వస్తే కూర్పు కుదిరేదెలా?

ఢిల్లీ: చాంపియన్స్ ట్రోఫీకి ముందు సన్నాహకంగా స్వదేశంలో ఇంగ్లండ్‌తో జరుగుతున్న వన్డే సిరీస్‌లో టీమ్‌ఇండియా చేస్తున్న ప్రయోగాలతో తుది కూర్పులో గందరగోళం నెలకొంది. రెండో వన్డేతో సారథి రోహిత్ ఫామ్ అందుకోగా ప్రతిష్టాత్మక టోర్నీ ముందు కోహ్లీ కూడా భారీ ఇన్నింగ్స్ బాదేస్తే భారత అభిమానుల బెంగ తీరినట్టే అవుతుంది. కానీ ఇప్పుడు దీని కంటే ఆందోళన కలిగిస్తున్న అంశం.. ఐదో స్థానంలో ఎవర్ని ఆడించాలి? అనేదే. వన్డే ప్రపంచకప్‌లో ఈ స్థానంలో బ్యాటింగ్‌కు వచ్చి నిలకడగా ఆడిన కేఎల్ రాహుల్‌ను కాదని ఇంగ్లండ్‌తో సిరీస్‌లో కోచ్ గౌతం గంభీర్.. అక్షర్ పటేల్‌ను బ్యాటింగ్ ఆర్డర్‌లో ప్రమోట్ చేసి ఐదో స్థానంలో ఆడిస్తున్నాడు. ఈ ప్రయోగంతో లెఫ్ట్ అండ్ రైట్ కాంబినేషన్ కుదిరి భారత్‌కు మెరుగైన ఫలితాలే వస్తున్నాయి. గత రెండు మ్యాచ్‌లలో అక్షర్.. (52, 41) అంచనాలకు మించి రాణించాడు. శ్రేయస్, హార్దిక్‌తో కీలక భాగస్వామ్యాలు నెలకొల్పాడు. కానీ ఆరో స్థానంలో వచ్చిన రాహుల్ మాత్రం (2,10) విఫలమవుతున్నాడు. అక్షర్ రూపంలో ఈ ప్రయోగం విజయవంతమైనా రాహుల్‌కు వచ్చేసరికి మాత్రం వికటించిందని చెప్పక తప్పదు. ఎందుకంటే రాహుల్‌కు ఐదులో మంచి రికార్డు ఉంది.

లయ తప్పిన రాహుల్

రాహుల్ వన్డే కెరీర్‌లో 79 మ్యాచ్‌లాడి 2,863 పరుగులు చేస్తే అందులో నంబర్.5లో 30 ఇన్నింగ్స్‌లు ఆడి 1,259 రన్స్ సాధించాడు. ఈ క్రమంలో అతడి సగటు 60గా నమోదు కాగా 2 శతకాలు, 10 అర్ధ శతకాలు చేశాడు. వన్డే వరల్డ్‌కప్‌లో అతడు ఐదో స్థానంలో బ్యాటింగ్‌కు వచ్చి 450 పరుగులు చేసి జట్టు విజయాల్లో కీలక పాత్ర పోషించాడు. జట్టు కోసం ఓపెనింగ్ నుంచి ఏడో స్థానం దాకా ఎక్కడైనా ఆడేందుకు సిద్ధంగా ఉండే రాహుల్.. గత రెండు మ్యాచ్‌లలో మాత్రం లయ తప్పాడు. ఆరో స్థానంలో అతడు 6 ఇన్నింగ్స్‌లలో 42 పరుగులు మాత్రమే చేశాడు. గంభీర్, టీమ్ మేనేజ్‌మెంట్ నిర్ణయంపై రవిశాస్త్రి, కృష్ణమచారి శ్రీకాంత్ వంటి సీనియర్లు బహిరంగంగానే పెదవి విరుస్తున్నారు. రాహుల్ పరిస్థితిని చూస్తుంటే బాధగా ఉందని, ప్రయోగాలను పక్కనబెట్టి అతడిని ఐదో స్థానంలో కొనసాగిస్తేనే భారత్‌కు మంచిదని వాళ్లు అభిప్రాయపడుతున్నారు.

పంత్ వస్తే ఎలా?

ఇంగ్లండ్‌తో వన్డే సిరీస్‌లో పంత్‌ను కాదని రాహుల్‌కు అవకాశమిచ్చిన టీమ్ మేనేజ్‌మెంట్.. చాంపియన్స్ ట్రోఫీలో ఒకవేళ పంత్‌ను ఆడిస్తే తుది కూర్పు విషయంలో మళ్లీ గందరగోళం నెలకొనే పరిస్థితి ఏర్పడుతుంది. ఐదో స్థానంలో అక్షర్, ఆ తర్వాత పంత్, జడేజా కూడా ఎడమ చేతి వాటం బ్యాటర్లే. అదీగాక ఆఖరి ఓవర్లలో రాహుల్‌తో పోలిస్తే పంత్ కాస్త దూకుడుగా ఆడగలడు. మరి రాహుల్ విషయంలో రోహిత్, గంభీర్ ఎలాంటి నిర్ణయం తీసుకుంటారనేది ఆసక్తికరంగా మారింది.

బ్రిట్జ్‌కె ధమాకా

అరంగేట్రం మ్యాచ్‌లోనే అత్యధిక స్కోరు

బ్రిట్జ్ (150)

లాహోర్: ప్రతిష్టాత్మక చాంపియన్స్ ట్రోఫీకి ముందు న్యూజిలాండ్ వరుస విజయాలతో అదరగొడుతోంది. సోమవారం దక్షిణాఫ్రికాతో జరిగిన మ్యాచ్‌లో కివీస్ 6 వికెట్ల తేడాతో జయభేరి మోగించింది. మొదట బ్యాటింగ్ చేసిన సౌతాఫ్రికాకు అరంగేట్ర కుర్రాడు మాథ్యూ బ్రిట్జ్‌కె (148 బంతుల్లో 150, 11 ఫోర్లు, 5 సిక్సర్లు) రికార్డు శతకంతో చెలరేగగా మల్డర్ (64) రాణించడంతో ఆ జట్టు 50 ఓవర్లలో 304/6 స్కోరు చేసింది. అరంగేట్రం మ్యాచ్‌లోనే అత్యధిక స్కోరు(150) చేసిన బ్యాటర్‌గా బ్రిట్జ్‌కే అరుదైన రికార్డు సొంతం చేసుకున్నాడు. ఈ క్రమంలో 47 ఏండ్ల క్రితం హేన్స్(148) నమోదు చేసిన రికార్డును బ్రిట్జ్‌కె తిరుగరాశాడు. నిర్దేశిత లక్ష్యాన్ని కివీస్ 48.4 ఓవర్లలో పూర్తిచేసింది. విలియమ్సన్ (133 నాటౌట్)సూపర్ సెంచరీతో చెలరేగాడు.

పైరసీదారులపై కేసులు పెడతాం!

'పైరసీ పెద్ద నేరం. 'తండేల్' సినిమాను పైరసీ చేస్తున్న వెబ్‌సైట్స్, వాట్సాప్, టెలిగ్రామ్ గ్రూప్ అడ్మిన్‌లకు ఇదే మా హెచ్చరిక. అందరిపై కేసులు పెడుతున్నాం. మీరు జైలుకి వెళ్లే అవకాశం ఉంది' అన్నారు అగ్ర నిర్మాత అల్లు అరవింద్. నాగచైతన్య, సాయిపల్లవి జంటగా చందూ మొండేటి దర్శకత్వంలో తెరకెక్కిన 'తండేల్' చిత్రం ఇటీవలే ప్రేక్షకుల ముందుకొచ్చింది. ఈ చిత్రాన్ని పైరసీ చేసి ఆన్‌లైన్‌లో పెట్టడంతో పాటు ఆంధ్రప్రదేశ్ ఆర్టీసీ బస్సుల్లోనూ ప్రదర్శించారు. ఈ పైరసీ వ్యవహారంపై సోమవారం చిత్ర నిర్మాత బన్నీ వాసు, సమర్పకుడు అల్లు అరవింద్ ప్రెస్‌మీట్ నిర్వహించారు. అల్లు అరవింద్ మాట్లాడుతూ 'నిర్మాతలు, ఫిల్మ్ చాంబర్ తీసుకుంటున్న చర్యల వల్ల కొన్నేళ్లుగా పైరసీ ఆగిపోయింది. మళ్లీ రెండు నెలల నుంచి పైరసీ భూతం పడగ విప్పుతున్నది. పైరసీపై పోరాటం చేసేందుకు ఫిల్మ్ చాంబర్‌లో సెల్ ఏర్పాటు చేశాం. వాళ్లు పగలూ, రాత్రి పైరసీ నియంత్రణకు పనిచేస్తున్నారు. అయినా వాట్సాప్ గ్రూపుల్లో లింక్‌లను ఫార్వర్డ్ చేస్తున్నారు. ఆ గ్రూప్‌ల అడ్మిన్‌లను గుర్తించి వారి సమాచారాన్ని సైబర్‌క్రైమ్‌కు చేరవేశాం. వారందరిని అరెస్ట్ చేయిస్తాం' అన్నారు. బన్నీ వాసు మాట్లాడుతూ 'పైరసీ విషయంలో కేసులు నమోదైతే వెనక్కి తీసుకోలేరు. ఇప్పుడున్న సాంకేతికత ప్రకారం అందరిని ట్రాక్ చేయొచ్చు. సైబర్ పోలీసులు వారిని సులభంగా పట్టుకుంటారు. పైరసీ చేసిన వాళ్లకి, దానిని డౌన్‌లోడ్ చేసుకున్న వాళ్లకీ కేసులు వర్తిస్తాయి. కేబుల్ ఆపరేటర్లు ఎవరైనా ఒక్క క్లిప్ ప్లే చేసినా కేసులు పెడతాం' అని హెచ్చరించారు.

రామ్‌చరణ్ నా ఏకైక మేనల్లుడు

'తండేల్' ఈవెంట్‌లో దిల్‌రాజును ఉద్దేశిస్తూ నేను సరదాగా అన్న మాటలు మెగా అభిమానులను బాధించాయి. దాంతో నన్ను విపరీతంగా ట్రోల్ చేశారు. నేను ఉద్దేశ్యపూర్వకంగా అన్న మాటలు కావవి. అయినా రామ్‌చరణ్ నా బిడ్డ లాంటివాడు. నా ఏకైక మేనల్లుడు. అతనికి నేను ఏకైక మేనమామను. నేనెందుకు అతన్ని తక్కువ చేస్తాను. అయినా అలా మాట్లాడకుండా ఉండాల్సింది. దయచేసి ఈ విషయాన్ని ఇక్కడితో వదిలేయండి.. ప్లీజ్..' అని అల్లు అరవింద్ అన్నారు. 'తండేల్' వేడుకలో 'ఒక సినిమా(గేమ్‌ఛేంజర్)ను కిందకు తీసుకెళ్లి, మరొక సినిమా(సంక్రాంతికి వస్తున్నాం)ను పైకి తీసుకెళ్లి.. ఇన్‌కమ్ ట్యాక్స్ వాళ్లని పిలిచి.. ఈ వారంరోజులు రకరకాలు చేశాడు..' అంటూ దిల్‌రాజుతో తాను మాట్లాడిన మాటలు వివాదం కావడంతో అల్లు అరవింద్ పై విధంగా వివరణ ఇచ్చారు.

చిత్రం

35 ఏళ్ళ బ్రహ్మచారి

శ్రీవిష్ణు కథానాయకుడిగా నటిస్తున్న పూర్తి వినోదాత్మక చిత్రం '#సింగిల్'. కార్తీక్ రాజు దర్శకత్వంలో విద్య కొప్పినీడి, భాను ప్రతాప్, రియాజ్ చౌదరి కలిసి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. అల్లు అరవింద్ సమర్పకులు. ఈ చిత్రం టైటిల్ పోస్టర్, గ్లింప్స్‌ని మేకర్స్ సోమవారం విడుదల చేశారు. ఈ పోస్టర్‌లో ఒక చేతిలో మ్యూజిక్ సిస్టం, మరొక చేతిలో దీపావళి క్రాకర్ పట్టుకొని శ్రీవిష్ణు రెబల్‌గా కనిపిస్తున్నారు. 35ఏండ్ల వయసులో కూడా తానెందుకు ఒంటరిగా ఉన్నాడో వివరిస్తూ వెన్నెల కిశోర్ వాయిస్‌తో ఈ గ్లింప్స్ సాగింది. వాలెంటైన్స్ డే రోజున ఒక పార్క్‌లోకి మ్యూజిక్ సిస్టమ్‌తో రావడం, క్రాకర్స్ కాల్చడం, పార్క్‌లో ఉన్న ప్రేమజంటలన్నీ అప్‌సెట్ అవ్వడం.. ఈ సన్నివేశాలన్నీ అలరిస్తాయి. శ్రీవిష్ణు స్టైలిష్ మేకోవర్, హీరోయిన్లు కేతికా శర్మ, ఇవానా అందచందాలు ఈ గ్లింప్స్‌లో హైలైట్స్. ఈ చిత్రానికి మాటలు: భాను భోగవరపు, నందు సవిరిగాన, కెమెరా: ఆర్.వెల్‌రాజ్, సంగీతం: విశాల్ చంద్రశేఖర్, నిర్మాణం: గీతాఆర్ట్స్, కళ్యా ఫిల్మ్స్.

ఎవరి తప్పుకో మేమెందుకు బలి కావాలి?

ఇటీవల జరిగిన'లైలా' సినిమా ప్రీరిలీజ్ ఈవెంట్‌లో నటుడు 30 ఇయర్స్ ఇండస్ట్రీ పృథ్వీ మాట్లాడిన మాటలు వివాదాస్పదమయ్యాయి. ఏపీ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహనరెడ్డిని ఉద్దేశించి నటుడు పృథ్వీ కావాలనే ఇలా మాట్లాడారని ఆ పార్టీ శ్రేణులు భగ్గుమన్నాయి.'ఈ సినిమాలో నా పాత్ర పేరు మేకల సత్తి. మేకల ఓనర్‌ని. లొకేషన్లో మేకలు తీసుకొచ్చి పెట్టారు. నన్ను అరెస్ట్ చేస్తారు. అరెస్ట్ చేసే సీన్ తీసేముందు.. షాట్ గ్యాప్‌లో సరదాగా మేకల్ని లెక్కపెట్టాం. మొత్తం 150 ఉన్నాయి. సినిమా చివర్లో నేను జైల్ నుంచి విడుదల అవుతా. అప్పుడు లెక్కపెడితే గమ్మత్తుగా 11 ఉన్నాయి' అంటూ పృథ్వీ చేసిన వ్యాఖ్యలపై వైఎస్ఆర్‌సీపీ శ్రేణులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. విశ్వక్‌సేన్ 'లైలా' సినిమాను ఆంధ్రప్రదేశ్‌లో బాయ్‌కాట్ చేయాలంటూ పిలుపునిచ్చాయి. ఈ నెల 14న 'లైలా' సినిమా విడుదల కానుండటంతో ఈ వివాదంపై చిత్ర కథానాయకుడు విశ్వక్‌సేన్, నిర్మాత సాహు గారపాటి సోమవారం హైదరాబాద్‌లో ప్రెస్‌మీట్ నిర్వహించారు. 'ప్రస్తుతం జరుగుతున్న పరిణామాలు మా టీమ్ మొత్తాన్నీ కలవరానికి గురి చేస్తున్నాయి. రిలీజ్ రోజే హెచ్‌డీ ప్రింట్ లింక్ పెడతామంటూ సోషల్ మీడియాలో బెదిరిస్తున్నారు. 'లైలా బాయ్‌కాట్' అంటూ పాతికవేల ట్వీట్లు వేశారు. ఏవరో చేసిన తప్పుకు మేమెందుకు బలి కావాలి? తను మాట్లాడుతున్నప్పుడు నేనూ, ప్రొడ్యూసర్‌గారూ అక్కడలేం. చిరంజీవిగారిని రిసీవ్ చేసుకోడానికి వెళ్లాం. ఆయన ఇలా మాట్లాడారని ఇంటికెళ్లేంత వరకూ మాకు తెలీదు. అసలు ఆయన వివరించిన సన్నివేశం మా సినిమాలో లేదు. అలాంటి సీన్ మేం పెట్టలేదు. ఆయన మాటలతో మాకెలాంటి సంబంధం లేదు. మా ఎదురుగా ఇది జరిగుంటే అప్పుడే మైక్ లాక్కునేవాళ్లం. ఆయనపై కోపం సినిమాపై చూపించడం భావ్యం కాదు. సినిమాకోసం చాలా కష్టపడ్డాం. విడుదలకు ముందే చంపేయకండి. సారీ చెబితేనే కూల్‌డౌన్ అవుతామంటే.. అతని తరపున నేను క్షమాపణలు కోరుతున్నా' అన్నారు.

డాక్టర్ భ్రమరం పాత్రలో..

సమాజంలో ప్రస్తుతం ఉన్న ఓ సమస్యను వినోదాత్మకంగా చూపిస్తూ తెరకెక్కిస్తున్న చిత్రం 'సంతాన ప్రాప్తిరస్తు'. విక్రాంత్, చాందినీ చౌదరి జంటగా నటిస్తున్నారు. సంజీవ్‌రెడ్డి దర్శకుడు. మధుర శ్రీధర్‌రెడ్డి, నిర్వి హరిప్రసాద్‌రెడ్డి నిర్మాతలు. నిర్మాణం తుదిదశకు చేరుకున్న ఈ సినిమా త్వరలో విడుదల కానుంది. ప్రమోషన్‌లో భాగంగా ఇందులో కీలక పాత్ర పోషిస్తున్న వెన్నెల కిశోర్ ఫస్ట్‌లుక్ పోస్టర్‌ని మేకర్స్ విడుదల చేశారు. ఇందులో ఆయన డాక్టర్ భ్రమరంగా కనిపిస్తారని, గర్భగుడి వెల్‌నెస్ సెంటర్ నిర్వహించే డాక్టర్ భ్రమరం.. తన దగ్గరకు సంతాన లేమి సమస్యలతో వచ్చే వారికి ఆయుర్వేద వైద్యాన్ని మోడరన్ మందులతో కలిపి ఎలా ట్రీట్ చేశారు అనేది హిలేరియస్‌గా ఉంటుందని, తన డైలాగ్ టైమింగ్‌తో వెన్నెల కిశోర్ పొట్టచెక్కలయ్యేలా నవ్విస్తారని మేకర్స్ చెబుతున్నారు. తరుణ్ భాస్కర్, అభినవ్ గోమటం, మురళీధర్ గౌడ్ తదితరులు ఇతర తారాగణం.

ప్రేమకోసం ప్రతీకారం

విరాజ్ రెడ్డి, మిమీ లియానార్డ్, శిల్పా బాలకృష్ణ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'గార్డ్'. 'రివేంజ్ ఫర్ లవ్' ఉపశీర్షిక. జగ పెద్ది దర్శకుడు. అనసూయ రెడ్డి నిర్మాత. ఈ నెల 28న ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ సందర్భంగా ఇటీవల ఏర్పాటు చేసిన సమావేశంలో హీరో విరాజ్ రెడ్డి చీలం చిత్ర విశేషాలు తెలియజేస్తూ 'ఈ సినిమా చిత్రీకరణను మొత్తం ఆస్ట్రేలియాలో జరిపాం. హారర్ థ్రిల్లర్ నేపథ్యంలో సాగే లవ్‌స్టోరీ ఇది. కథానుగుణంగా చక్కటి పాటలు కుదిరాయి' అన్నారు. ఈ ప్రేమకథా చిత్రంలో కథానుగుణంగా మంచి పాటలు కుదిరాయని సంగీత దర్శకుడు ప్రణయ్ తెలిపారు. ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: మార్క్ కెన్నీడ్, నేపథ్య సంగీతం: సిద్ధార్థ్ సదాశివుని, దర్శకుడు: జగ పెద్ది.

ఫ్లడ్ లైటల్లే వచ్చావే బేబీ నువ్వే..

సందీప్ కిషన్, రీతు వర్మ జంటగా నటిస్తున్న మోస్ట్ ఎవైటెడ్ మూవీ 'మజాకా'. త్రినాథరావు నక్కిన దర్శకుడు. రాజేష్ దండా, ఉమేష్ కెఆర్ బన్సాల్ నిర్మాతలు. మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా ఈ నెల 26న సినిమా విడుదల కానుంది. ప్రమోషన్‌లో భాగంగా ఇటీవల విడుదల చేసిన ఫస్ట్ సింగిల్ 'బ్యాచులర్స్ ఆంథమ్' సూపర్‌హిట్ అయ్యిందని మేకర్స్ చెబుతున్నారు. ఈ నేపథ్యంలో సోమవారం రెండో పాటని విడుదల చేశారు. 'బెడ్ లైటైనా లేనీ.. చీకటి లైఫ్ లోకీ.. ఫ్లడ్ లైటల్లే వచ్చావే... బేబీ నువ్వే..' అంటూ సాగే ఈ పాటను చంద్రబోస్ రాయగా, లియోన్ జేమ్స్ స్వరపరిచారు. సందీప్‌కిషన్ ప్రేమకథను ప్రెజెంట్ చేసేలా ఈ పాట సాగింది. అలాగే.. రావురమేష్, అన్సు లవ్‌స్టోరీ కూడా ఈ పాటలో భాగమవ్వడం విశేషం. సందీప్‌కిషన్ ఈ పాటలో చాలా ఎనర్జిటిక్‌గా కనిపించారు. ఆయన డ్యాన్స్ మూమెంట్స్ కూడా ఆకట్టుకుంటాయి. ఈ చిత్రానికి రచన: ప్రసన్నకుమార్ బెజవాడ, కెమెరా: నిజార్ షఫీ, సహ నిర్మాత: బాలాజీ గుత్తా, నిర్మాణం: ఎకె ఎంటర్టైన్మెంట్, హాస్య మూవీస్, జీ స్టూడియోస్.

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Published at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/38229.